క్లుప్తంగా

విజయవంతమైన హెల్త్‌క్యాంప్



ఊట్కూరు: మండలంలోని పెద్దపొర్లలో కార్మికశాఖ ఆధ్వర్యంలో గురువారం భవన నిర్మాణ రంగ కార్మికులకు చేపట్టిన హెల్త్‌క్యాంప్ విజయవంతమైంది. ఈ శిబిరంలో గుర్తింపు కార్డు ఉన్న కార్మికులకు బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో కనకారాయుడు, ఉపసర్పంచ్ ఈశ్వర్, ఐఎఫ్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

బహుజనుల సత్తా చాటుదాం..



మద్దూరు: కొడంగల్ నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న బహుజనుల బలాన్ని నిరూపిద్దామని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద కిష్టప్ప తెలిపారు. గురువారం కొత్తపల్లి మండలంలోని కిసన్‌నగర్‌లో పార్టీ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. ఈమేరకు ఆమె మాట్లాడుతూ.. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాయకత్వంలో బీఎస్పీ గ్రామాగ్రామాన పటిష్ట నిర్మాణంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మరియు అగ్రవర్ణాల పేదలందరిని కలుపుకొని నియోజకవర్గంలో బహుజన బలగం బలాన్ని నిరూపిద్దామని తెలిపారు. కిషన్‌నగర్ గ్రామ బీఎస్పీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మొగులప్ప, ఉపాధ్యక్షుడిగా అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా గోవింద్, కార్యదర్శిగా ప్రసాద్, కన్వీనర్‌గా సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



ధన్వాడ: రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు మండలంలోని గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ రాజారాం తెలిపారు. ఈ నెల 29నుంచి వచ్చేనెల 2వరకు సంగారెడ్డి జిల్లాలోని సదాశివపేట్‌లో అండర్ 19పుట్‌బాల్ టోర్నమెంట్‌లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా తరుపున పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ సురేష్‌రావు, నాగమణి, కోచ్ డాక్టర్ రామ్మోహన్‌గౌడ్, పీఈటీ సుగుణాకర్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఊట్కూరు: మండలంలోని పులిమామిడిలో గురువారం ఇటీవల మృతిచెందిన రాములు కుటుంబానికి వైస్‌ఎంపీపీ ఎల్లగౌడ్ ఆర్థికసాయంగా రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాంరెడ్డి, సమరసింహారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ



మక్తల్: మండలంలోని పంచలింగాల గ్రామానికి చెందిన రాఘవేందర్‌రావుకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ. లక్ష చెక్కును ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం రాఘవేందర్‌రావుకు అందజేశారు. ఎమ్మెల్యేతోపాటు మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గుంత

మాగనూర్: మండల పరిధిలోని మందిపల్లి సమీపంలో ములమలుపు వద్ద జియోట్యాగ్ కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారిందని పలువురు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ములమలుపు వద్ద అసంపూర్తిగా పనులు చేయడంతో రాత్రి సమయంలో ద్విచక్రవాహనదారులు ఆ గుంతలో పడి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని సంబధిత అధికారులు పనులపై ప్రత్యేక దృష్టిపెట్టి పూర్తిస్థాయిలో పనులు నిర్వహించాలని కోరుతున్నారు.





నారాయణపేటలో దాండియా ఆడుతున్న చిన్నారులు



అడుగుల భజన చేస్తున్న యువకులు

ప్రశాంతంగా.. నిమజ్జనోత్సవం

జిల్లాకేంద్రంలో బుధవారం రాత్రి ప్రారంభమైన నిమజ్జనోత్సవం గురువారం ప్రశాంతంగా ముగిసింది. దాదాపు 30గంటలకు పైగా గణనాథులను ప్రత్యేక వాహనాల్లో అలంకరించి.. పట్టణ పురవీధులగుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దల భజనలు.. యువకుల నృత్యాలు.. చిన్నారుల కేరింతలు.. మహిళల బతుకమ్మల ఆటపాటలతో ఊరేగింపు వైభవంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు వేడుకలను వేడుకలను తిలకించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది.

– నారాయణపేట రూరల్



నారాయణపేటలో గణనాథుల శోభాయాత్ర



నిమజ్జనానికి ముందు గణనాథుడితో



నిమజ్జనానికి మట్టి వినాయకుడిని తరలిస్తున్న శ్రీహంసవాహిని విద్యార్థులు

ధన్వాడలో..



ధన్వాడలో నిమజ్జనానికి తరలిన వినాయకులు

ధన్వాడ: మండలంలోని గురువారం వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గత పదకొండురోజుల నుంచి పూజలందుకున్న గణనాథుడికి ప్రత్యేకంగా పూజలుచేసి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు చేశారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. అంతకుముందు పట్టణంలోని మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఎటువంటి సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



నృత్యాలు చేస్తున్న మహిళలు

చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి



దీక్షలో మాట్లాడుతున్న నాయకులు లక్ష్మయ్య

మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలని చేపట్టిన రిలే నిరహార దీక్షలు గురువారంతో 90వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు లక్ష్మయ్య మాట్లాడుతూ.. గతరెండు నెలల క్రితం రహస్యంగా కంపెనీని ప్రారంభించి వాటినుంచి వచ్చే కలుషిత నీటిని మన్నెవాగులో వదులుతున్నారని తెలిపారు. కలుషితనీటితో వాగుపై నిర్మించిన చెక్‌డ్యాంలో నీరుచేరి చేపపిల్లలు మృతువాత పడుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఇక్కడి ప్రజల అనుమతిలేకుండా నిర్మించిన ఇథనాల్ కంపెనీని ఎత్తివేసేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



మక్తల్: పట్టణంలోని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కొండయ్య, చంద్రకాంత్‌గౌడ్, నర్సింహాగౌడ్, శ్రీకాంత్, అంబాదాస్‌రావు, బస్వరాజ్, శ్రీనివాస్‌గుప్తా, మహిపాల్ రెడ్డి, భాస్కర్, దయానంద్, మాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తలకు కనీస వేతనం అమలు చేయాలి

మక్తల్: ఆశ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆశాలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 4వ రోజుకు చేరుకుంది. ఈ మేరకు మండల కన్వీనర్ గోవింద్ రాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశలకు రూ.18వేలు పారితోషికంతోపాటు రూ. 5 లక్షల ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో మండలం కన్వీనర్ గోవింద్‌రాజు, ఇందిర, అనిత, యశోద, గోవిందమ్మ, పార్వతమ్మ, అమీనా, అనురాధ, నర్సమ్మ, వెంకటమ్మ, రస్వాతి తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మెచేస్తున్న ఆశలు

ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



మద్దూరు: జిల్లాలోని పంచాయతీ వ్యవస్థలో పనిచేస్తున్న ఈ- పంచాయతీ ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని ఆపరేటర్లు జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. గత 13ఏళ్లుగా పంచాయతీలోని ప్రతి పనిని ఆన్‌లైన్ చేయడంతో తీవ్రంగా కృషిచేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటివరకు మాకు ప్రభుత్వం ఏలాంటి హామీలేకపోవడంతో ఇప్పటికైనా ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. పంచాయతీ ఆపరేటర్ల డీపీఎం రవికుమార్, సురేష్, వెంకటేష్, భతర్, ప్రమోద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మక్తల్‌లో..

మక్తల్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద గురువారం సమ్మె నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చర్చలు జరిపి తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలన్నారు. ఉద్యోగభద్రత కల్పించి కనీస వేతనం రూ. 26వేలు చెల్లించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకుడు ఆంజనేయులు, జిల్లా నాయకులు నర్సింహ, మండల కన్వీనర్ గోవింద్‌రాజు, ఏఐటీయూసీ నర్సింహ, విజయలక్ష్మి, జమున, మంజుల, రాధిక, శ్రీలత, జయమ్మ, కవిత, సుకన్య, సునీత, మల్లమ్మ, భాగ్యమ్మ, లింగమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ



కోస్గిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కోస్గి: మహ్మద్ ప్రవక్త జయంతిని పురష్కరించుకొని పట్టణంలో గురువారం మిలాద్-ఉన్-నబీ ఉత్సవాలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రధాన రోడ్లపై పెద్ద సంఖ్యలో శాంతిర్యాలీ చేశారు. మజీదులు, దర్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మైనార్టీ సంఘ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



మక్తల్‌లో ..

మక్తల్: పట్టణంలోని మిలాద్-ఉన్-నబీ పండగను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ప్రేమ, శాంతి, సహనం సామరస్యాలను బోధించిన మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయా పట్టణాల్లో ముస్లింలు ఊరేగింపు నిర్వహించారు. అంతకుముందు నూర్‌మసీద్ వద్ద బూరాన్‌గడ్డ యూత్ ఆధ్వర్యంలో స్వీట్ జ్యూస్, తాగునీరు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

దారి కష్టాలు తీరేదెన్నడో..?

మాగనూర్: మండల పరిధిలోని తళంకేరి గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దారికష్టాలు ఎప్పుడు తీరుతాయో తెలియని పరిస్థితి ఏర్పడింది. నడవడానికి కనీసం రోడ్డులేక చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బీటీరోడ్డు నుంచి పాఠశాలకు వెళ్లేదారి బురదమయంగా మారి పాఠశాలకు వెళ్లలేని దుస్థితిఏర్పడిన ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లేదారిని బాగుచేయాలని కోరుతున్నారు.



బురదమయంగా మారిన పాఠశాల దారి

ఘనంగా భగత్ సింగ్ జయంతి



మక్తల్‌లో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మక్తల్: పట్టణంలో వివేకానంద చౌరస్తాల్లో భగత్ సింగ్ జయంతిని గురువారం ఏబీవీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినయ్ మాట్లాడుతూ.. నేటి యువత భగత్‌సింగ్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని భావితరాలకు భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తిని అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వినయ్, నిఖిల్, నితిన్, శరణ్, రాజు, అనిల్, మల్లేష్, అరవింద్ పాల్గొన్నారు.

తవ్వారు.. వదిలేశారు



నల్లలీకేజీ నుంచి పారుతున్న నీరు

నారాయణపేట: పట్టణంలోని శాసన్‌పల్లిరోడ్డులో విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు కేంద్రం ఎదుట నాలుగురోజుల కింద మున్సిపాలిటీ సిబ్బంది డ్రైయినేజీ కోసం జేసీబీతో తవ్వారు.. దీంతో అక్కడ ఉన్న మంచినీటి పైప్‌లైన్ కట్ అయింది. ఆ రోడ్డు మార్గన ఉన్న పైపులైన్ లీకేజీని సరిచేయకుండా వదిలేశారు. రైతులు ట్రాన్స్‌ఫార్మర్స్ కాలిపోయి ఇక్కడికి తీసుకొచ్చిన తర్వాత లోపలికి వెళ్లాలన్న, రావాలన్నా ఇబ్బందులు పడుతున్నారు. గుంతలు తవ్వే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్స్ రిపేరు కేంద్రానికి సంబంధించిన నల్లాపైపు ధ్వంసం కావడంతో సెంటర్‌లో పనిచేసే కార్మికులకు, రైతులకు నీటిసమస్య ఏర్పడింది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు, ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రం సిబ్బంది కోరుతున్నారు.

ఒకే భవనంలో పంచాయతీ, అంగన్‌వాడీ



ఒకే భవనంలో కొనసాగుతున్న పంచాయతీ అంగన్‌వాడీ కేంద్రం

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో ఒకే భవనంలో పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. రెండుకలిపి ఒకే భవనంలో కొనసాగించడంతో పాలన పరంగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అంగన్‌వాడీ పిల్లలు ఉంటే, గది ఆరు బయట పంచాయతీకి సంబంధించిన గ్రామసభలు, తదితర వ్యవహారాలను నడిపిస్తున్నారు. ఇలా రెండు ప్రభుత్వ కార్యాలయలు ఒకేగదిలో కొనసాగడంతో ఇబ్బందిగా మారిందని ఇరువురు శాఖల వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనం మంజూరు చేసేందుకు పాలకులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టిప్పర్ల ధాటికి ధ్వంసమైన రోడ్డు



ధ్వంసమైన మాధవరం రోడ్డు

మరికల్: మండలంలోని పల్లెగడ్డ, మాధవరం కన్మనూర్ రహదారులపై మోరం, ఇసుక, ఇటుక బట్టీలకు తరలించే బుడిద టిప్పర్ల కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయి. గత ఆరునెలల క్రితమే మరమ్మతుల కిందరోడ్లు వేశారు. రాత్రి, పగలు ఏకధాటిగా టిప్పర్ల నడవడంతో రోడ్లు గుంతలుగా మారి ఇతర వాహనాలు రాకపోకాలకు ఇబ్బందిగా మారిందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మొరం, ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్లను పట్టుకొని కేసులు నమోదుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు నిమజ్జనానికి ఏర్పాట్లు



మక్తల్లో స్వాగత వేదిక ఏర్పాటు

మక్తల్: పట్టణంలో శుక్రవారం జరిగే గణేశ్ నిమజ్జనానికి గురువారం ఏర్పాట్లు చేశారు. డీజే బాక్సులు, ట్రాక్టర్లకు డెకరేషన్లు, వివిధ రంగాల్లో ఉన్న వాటిని బ్యానర్లను ఏర్పాటు చేసుకుంటున్నారు. వినాయక మండపాల వద్ద లడ్డూ వేలం పాట పాడుతున్నారు. వీరభద్రక దేవాలయం వద్ద పట్టణానికి చెందిన ఆంజనేయులు 11 రోజుల పాటు అన్నదానం చేయడంతో ఘనంగా సన్మానించారు. రాంలీలా మైదానంలో నిర్వహించిన వేలం పాటలో అవినాష్‌రెడ్డి అనే వ్యక్తి రూ.86 వేలకు దక్కించుకున్నారు. ఇదిలా ఉండగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పకడ్బందీగా బందోబస్తు కల్పిస్తున్నారు. ఇప్పటికే దాదాపు 50 మంది పోలీసులు, 6 మంది ఎస్ఐలు మక్తల్‌కు వచ్చారు. ఆజాద్‌నగర్ చౌరస్తాలో గణేశ్ విగ్రహ ఉత్సవ కమిటీ స్వాగత వేదికను ఏర్పాటు చేసింది.

అభివృద్ధిలో దేశానికే ఆదర్శం

- ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు
- మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి



మూలమల్లలో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఆత్మకూర్: రాష్ట్ర అభివృద్ధి కేసీఆర్ సారథ్యంలో కొత్త పుంతలు తొక్కిందని, అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మండలంలోని మూలమల్లలో రూ.70 లక్షలతో సీసీరోడ్లు, రూ.20లక్షలతో పంచాయతీ భవనం, రూ.15లక్షలతో అంగన్‌వాడీ భవనం, రూ.5లక్షలతో వాల్మీకి దేవాలయానికి కంపౌండ్‌వాల్, రూ.5లక్షలతో యాదవ కమ్యూనిటీ భవన నిర్మాణాలకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం ఆత్మకూర్‌లోని బీసీకాలనీలో, అంబేడ్కర్‌నగర్‌లో వినాయక మండపాల వద్ద ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో రూ.40లక్షలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రూ.50లక్షలతో అదనపు తరగతి గదులు, మండలంలోని మోట్లంపల్లికి రూ.42లక్షలతో బీటీరోడ్డు నిర్మాణానికి పూజలు చేసి పనులు ప్రారంభించారు.

రైతులకు పెద్దపీట

రైతులకు రూ.లక్ష రుణమాఫీ, రైతుబంధు పథకం, 24గంటల ఉచిత విద్యుత్, పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తూ అన్నదాతకు అండగా నిలిచారని కొనియాడారు. పెన్షన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, దళితబంధు, బీసీలకు, మైనార్టీలకు రూ.లక్ష ఆర్థికసాయం లాంటి పథకాలు ప్రతి పేదవాడి ఇంటికి చేరాయని స్పష్టం చేశారు. ప్రజలు బీఆర్ఎస్ వెంటే ఉన్నారని, రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మత కల్లోలాలు సృష్టించే బీజేపీని, అబద్ధాల కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ మూడోసారి ప్రమాణస్వీకారం చేస్తారని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీపీ బంగారు శ్రీను, మాజీఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.